# ఆమె కల

- కొండవీటి సత్యవతి

**సుం**దరమ్మ వందోసారి తన ముంజేతిని, ఆ చేతికున్నవాచిని చూసుకుంటూ మురిసిపోయింది. ఎవరైనా వస్తున్నారేమోనని గుమ్మంలోంచి తొంగి చూస్తూనే వుంది. ఎందుకైనా మంచిదని తలుపు మూసుకుని వాచీ వేపు దీర్ఘంగా చూసుకుంటూ కూర్చుంది. ఆమెకి చెప్పలేనంత ఆనందంగా వుంది. అదే సమయంలో లోపలంతా దిగులుగా, బెదురుగా వుంది. కొంచెంసేపట్లో పిల్లలు ఇంటికొస్తారు. కూతురు గాని, కొడుకు గాని చూస్తే ఇంకేమైనా వుందా? కోడలు సరేసరి. వాళ్ళు వచ్చేలోపు దీన్ని ఎక్కడైనా దాచెయ్యాలి. పెట్టె అడుగున పడేస్తే సరి.

అయ్యో! అరగంటైనా చేతికుంచుకోలేదే! పెట్టెలో పడెయ్యడం ఎలా? పాడవుతుందేమో!

రకరకాలుగా ఆలోచిస్తూ వాచి తీసి పెట్టె అడుగున పడేసింది.


తను గట్టిగా నవ్వితేనే తన కొడుకూరుకోడు. 'ఎంటమ్మా! అంత గట్టిగా అలా నవ్వుతావ్' అంటాడు. తన కడుపున పుట్టినవాడు అయితేనేం తనని ఏమీ మాట్లాడనివ్వడు. ఇలా చెయ్యొద్దు, అలా చెయ్యొద్దు అంటూ హెచ్చరిస్తూవుంటాడు.

పిల్లలొచ్చే వేళవుతోంది. ఏదైనా టిఫిన్ చెయ్యాలి. సుందరమ్మ గబగబ వంటింట్లోకి నడిచింది. శనగపిండి కలిపి అరటికాయ బజ్జీలను చేసింది. ఫిల్టర్‌లో కాఫీ పొడివేసి నీళ్ళుపోసింది.

వంటింట్లో పనిచేస్తోందే గాని మనసంతా పెట్టెలో దాచిన బంగారు రంగు వాచీమీదే వుంది. ఏనాటి కల. రిస్టువాచీ పెట్టుకోవాలనే కోరికకి ఏభై ఏళ్ళు నిండిపోయాయి. కోరిక ముసలిదైపోయినా తనకి ఆశ చావలేదు.

సుందరమ్మకి తన చిన్నతనం, పెళ్ళి గుర్తొచ్చాయి. పద్నాలుగో ఏట తాలూకాఫీసులో. పనిచేసే గుమాస్తాతో జరిగిన పెళ్ళి. ఆఫీసుకే అంకితమైపోయే భర్త రంగారావు. ఎప్పుడూ క్యాంపులని ఊళ్ళు పట్టుకు తిరుగుతుండేవాడు. తన కన్నా పెద్దవాడైన రంగారావుని చూస్తేనే భయపడేది. పాతిక మందున్న ఉమ్మడి కుటుంబం, వొండి వార్చడం, ప్రతి సంవత్సరం పిల్లల్ని కనడం. ఏడుగుర్ని కన్నాక అతి కష్టం మీద ఆపరేషన్ చేయించుకుంది. పిల్లల్ని కనడం, వాళ్ళని పెంచడం, ఉమ్మడి కుటుంబానికి చాకిరీ చెయ్యడం ఈ విషయాలు తప్ప గుర్తు చేసుకోవడానికి మరే విషయమూ లేదు సుందరమ్మకి.

గడిచిపోయిన జీవితాన్ని తలుచుకుంటూ పరధ్యానంగా వుంది సుందరమ్మ. కాలింగ్ బెల్ టంగ్ టంగ్ మంటోంది. ఉలిక్కిపడి లేచి




**రం**గారావు దృష్టిలో ఆమె చాకిరీ చేసే యంత్రం. వేళాపాళా లేకుండా కలక్టరొచ్చాడని, మినిష్టరొచ్చాడని ఇంటికి మనిషిని పంపడం కారియర్‌లు కట్టించడం, అప్పటికప్పుడు పదిమందికి వంటచేసి వొడ్డించమని హుకుం జారీ చెయ్యడం. రెవెన్యూ ఇనస్పెక్టర్‌గా చేసే ఉద్యోగం వల్ల ఇల్లు పట్టకుండా తిరుగుతుండేవాడు. ఐదుగురు పిల్లల్ని ఒంటిచేత్తో పెంచుకొచ్చింది. అతనెపుడూ పిల్లల విషయం పట్టించుకునేవాడు కాదు. సుందరమ్మని ఒక మనిషిగా అతడేనాడు గుర్తించలేదు. తనకి, తన పిల్లలకి చాకిరీ చెయ్యడమే ఆమె జీవితలక్ష్యం అని అతడు భావించేవాడు. ఆమెకి కోరికలుంటాయిని అతను కల్లో కూడా అనుకునేవాడు కాదు.

వెళ్ళి తలుపుతీసింది. కూతురు సుభద్ర ఉస్సూరుస్సూరంటూ ఇంట్లోకొచ్చింది.

'ఏంటమ్మా! ఏంచేస్తున్నావ్? బెల్ వినబడ లేదా?' అంటూ విసుక్కుంది.

సుందరమ్మ ఏం మాట్లాడకుండా కూతురికి కాఫీ తీసుకురావడానికి వంటింట్లో కెళ్ళింది. పొద్దున్నించి ఒక్కర్తె ఇంట్లో పడివుంటుంది. తనతో కాస్త సరదాగా మాట్లాడదామనే ధ్యాస ఎవరికీ వుండదు. పైపెచ్చు విసుగ్గానో, చిరాగ్గానో ఇంటికి చేరతారు. పోన్లే వాళ్ళకేం సమస్యలున్నాయో... అనుకుంటూ కాఫీ కప్పులో పోసి కూతురి కిచ్చింది. సుభద్ర కాఫీ తాగేసి తన రూమ్‌లో కెళ్ళిపోయింది.



సుందరమ్మ మళ్ళీ ఒంటరిగా మిగిలింది.

ఫోన్ గణగణమంది. ఫోన్ అందుకుని 'హలో!' అంది.

పెద్దకొడుకు. తామిద్దరూ రాత్రికి భోజనానికి రామని వంట చెయ్యొద్దని చెప్పి ఫోన్ పెట్టేసాడు. ఎక్కడికి వెళుతుందీ, ఏటైముకి వచ్చేది ఈ వివరాలేం వుండవు. కొడుకు కోడలు ఆఫీసుల్నించే సినిమాలకి, షికార్లకి వెళ్ళడ అలవాటే. ఉదయం వెళ్ళేటప్పుడు చెప్పొచ్చుగా అనుకుంది.

ఓ అరగంట తర్వాత సుభద్ర తయారై బయటకొచ్చి, 'అమ్మా! నా ఫ్రెండు కూతురి పుట్టినరోజు భోజనానికి పిలిచింది. వెళ్ళొస్తా' అంటూ చెప్పులు టకటక లాడించుకుంటూ వెళ్ళిపోయింది.

సుందరమ్మకి వంట చెయ్యాలనిపించలేదు. తనొక్క దాని కోసం ఏం వొండుకుంటుంది. అందరూ తింటారని చేసిన అరటికాయ బజ్జీలు చప్పగా చల్లారిపోయి అలాగే వున్నాయి. ఎందుకలా దుబారా చేస్తారని విసుక్కుంటుంది కోడలు. చెయ్యకపోతే ఏమైనా చెయ్యొచ్చుగా అంటుంది. చేసినా తప్పే, చెయ్యకపోయినా తప్పే.

సుందరమ్మ వీధి తలుపులు వేసేసి టీ.వీ ముందు కూర్చుంది. ఏదో తెలుగు సీరియల్ వస్తోంది. అందులో కథానాయకి ఎప్పుడూ ఏడుస్తూనే వుంటుంది. వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తూనే డైలాగులు చెబుతుంది. ఆ ఏడుపు చూస్తే విసుగ్గా వుంటుంది. హాయిగా నవ్వుకునే సీరియల్ వస్తే బావుండు అనుకుంటూ రిమోట్ నొక్కుతూ కూర్చుంది. తెలుగు ఛానళ్ళలో అలాంటివే సీరియల్స్ వస్తున్నాయి. టీ.వీ ఆపేసి తన గదిలోకి వెళ్ళింది. పెట్టె తెరిచి మెరుస్తున్న వాచీని బయటకు తీసింది. కూతురు తనని కూడా పార్టీకి తీసికెళ్ళొచ్చుగా. ఈ వాచీ పెట్టుకుని సరదాగా బయటకెళితే బావుంటుంది కదా! తనని ఎవరూ రమ్మని అడగరు. అయినా వాచీ పెట్టుకుని వాళ్ళ కళ్ళబడడమే!

ఓ సారి సుభద్ర స్నానానికి కెళుతూ వాచి టేబిల్ మీద పెట్టింది. సుందరమ్మ దాన్ని తీసుకుని అరచేతిలో పెట్టుకుని అటూ ఇటూ తిప్పి చూస్తోంది. తన ముంజేతికి పెట్టుకుంటే ఎలా వుంటుందా అని ఆలోచిస్తుంటే కూతురు బయట కొచ్చింది.

'అరే! ఏంటమ్మా! ఈ వయసులో నీకు వాచి కావల సొచ్చిందా ఏమిటి?' అంటూ విసురుగా వాచి లాగేసుకుంది. సుందరమ్మకి మనస్సు చివుక్కు మన్నది. మళ్ళీ ఏరోజు ఎవరి వాచీ ముట్టుకోలేదు.

సుందరమ్మకి ఎలా కలిగిందో గాని రిస్టువాచీ అంటే పిచ్చిప్రేమ కలిగింది. ఆ కోరిక మనస్సంతా ఆక్రమించుకుని అది తీరని కోరికగా గానే వుండిపోయింది.

ఎప్పుడైనా భర్త వాచిని ముట్టుకుంటే ఊరుకునేవాడు కాదు.

ఓ సారి పడగ్గదిలో వున్నపుడు 'ఏమండీ! నాకు వాచీ కొనిపెట్టరూ' అని అడిగింది.

'వాచీనా!! ఎందుకూ? నువ్వేమైనా ఆఫీసరువా? టైముకి ఆఫీసు కెళ్ళాలా? అయినా ఇదేం పిచ్చికోరికే వెర్రిమొద్దూ చీర కావాలంటే చెప్పు కొనిపెడతా' అని పెంకులెగిరిపోయేలా నవ్వేడు. తను బిత్తర పోయింది. తన భర్త ఎంత మోటు మనిషో తనకు తెలుసుగాని మరీ ఇంత మోటు మనిషనుకోలేదు. ఆ రోజు నుంచి వాచి అనేది ఆమెకు ఓ అందమైన కల. ఆ కలని తీర్చేవారెవ్వరూ లేరు.

రంగారావు దృష్టిలో ఆమె చాకిరీ చేసే యంత్రం. వేళాపాళా లేకుండా కలక్టరొచ్చాడని, మినిష్టరొచ్చాడని ఇంటికి మనిషిని పంపడం కారియర్‌లు కట్టించడం, అప్పటికప్పుడు పదిమందికి వంటచేసి వొడ్డించమని హుకుం జారీ చెయ్యడం. రెవెన్యూ ఇనస్పెక్టర్‌గా చేసే ఉద్యోగం వల్ల ఇల్లు పట్టకుండా తిరుగుతుండేవాడు. ఐదుగురు పిల్లల్ని ఒంటిచేత్తో పెంచుకొచ్చింది. అతనెపుడూ పిల్లల విషయం పట్టించుకునేవాడు కాదు. సుందరమ్మని ఒక మనిషిగా అతడేనాడు గుర్తించలేదు. తనకి, తన పిల్లలకి చాకిరీ చెయ్యడమే ఆమె జీవితలక్ష్యం అని అతడు భావించేవాడు. ఆమెకి కోరికలుంటాయని అతను కల్లో కూడా అనుకునేవాడు కాదు.

సుందరమ్మ వాచి చేతుల్లో పెట్టుకుని రకరకాల ఆలోచనల్లో మునిగిపోయింది. ఇంత చిన్న కోరిక తీరడానికి నలభై సంవత్సరాలు పట్టింది. వాచీ అయితే వచ్చింది కానీ తను చేతికి పెట్టుకుని తిరగ్గలదా?

చిన్న కోడలు ప్రసన్న తన అన్నగారితో వాచి పంపిస్తూ అమెరికానించి రాసిన ఉత్తరం బయటకు తీసింది సుందరమ్మ. మధ్యాహ్నం అతనొచ్చి ప్రసన్న తనకే ఇమ్మని చెప్పిందంటూ ఇచ్చిన పాకెట్ విప్పి ముందు ఆశ్చర్యంలోనూ, తర్వాత సంతోషంలోనూ మునిగిపోయింది.

**అత్తయ్యగారికి,**

**నమస్కారం. ఈ వాచి మీ కోసమే పంపిస్తున్నాను. మీకు వాచి అంటే చాలా ఇష్టమని నాకు ఈ మధ్యనే తెలిసింది. వేళాకోళంగా మీ అబ్బాయి అంటేనే తెలిసింది. నేను వాచి కొంటుంటే 'ఈ వయస్సులో మా అమ్మకి వాచి ఏంటి' అంటూ నవ్వేడు కూడా. 'మీ మగాళ్ళు వందేళ్ళొచ్చినా కుర్రాళ్ళమే అనుకుంటారు. సూట్‌లు, బూట్‌లు వేసుకు తిరుగుతుంటారు. మా చిన్న కోరికలు కూడా మీకు వేళాకోళంగానే కనబడతాయి' అని అనేసరికి 'అబ్బో! అత్తగారంటే ఎంత ప్రేమో' అంటూ ఆటపట్టించాడు. మీరు మొహమాట పడకుండా చేతికి పెట్టుకోండి. ఎవరో ఏదో అనుకుంటారని భయపడనవసరం లేదు. మీరు వాచి చేతికి పెట్టుకుని ఫోటో తీయించుకుని నాకు పంపించాలి సుమా!**

మీ కోడలు

ప్రసన్న

అమెరికాలో వుండే చిన్నకోడలు తన కోరిక తెలుసుకుని వాచి పంపడం సుందరమ్మకి చాలా సంతోషాన్ని కల్గించింది. ఉత్తరం చదివేక ఆమె కళ్ళల్లో నీళ్ళొచ్చాయి. తన వాళ్ళనుకున్న మొగుడు గాని, కొడుకులు గానీ, ఆఖరికి కూతుళ్ళు గాని అర్థంచేసుకోలేకపోయిన తన చిరుకోరికను నెరవేర్చిన కోడలి మీద వల్లమాలిన అభిమానం కల్గింది సుందరమ్మకి.

ఆ రాత్రి వాచి చేతికి పెట్టుకుని గొప్ప సంతృప్తితో నిద్రలోకి జారిపోయింది సుందరమ్మ. ★

వచ్చేవారం కథ

దీపశిఖ

వాడ్రేవు వీరలక్ష్మీదేవి